

తాళ్లూరు లిఫ్టుపై రాజకీయం తగదు

- వైఎస్సార్ సీపీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం
- టీడీపీ నేతల తీరుపై మండిపడిన ప్రజాప్రతినిధులు

జగ్గంపేట: మెట్ట ప్రాంతానికి సాగునీరు అందించే తాళ్లూరు ఎత్తిపోతల పథకంపై టీడీపీ నేతలు రాజకీయం చేస్తున్నారని జగ్గంపేట, గండేపల్లి మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నేతలు అన్నారు. జగ్గంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర వైఎస్సార్ సీపీ సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒమ్మి రఘురాం మాట్లాడుతూ తాళ్లూరు ఎత్తిపోతల పథకానికి మరమ్మతులు చేసి మెట్ట ప్రాంత రైతులకు గోదావరి జలాలు అందించాలని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు కృషి చేస్తున్నారన్నారు. ఆయన కృషి ఫలితంగా సీఎస్ఆర్ నిధులు, స్థానిక దేవి ఫిషరీస్ నుంచి రూ.22.50 లక్షలు తాళ్లూరు పుష్కర ఎత్తిపోతల పథకం మరమ్మతులకు మంజూరయ్యాయని తెలిపారు. ఈ విషయం తెలిసిన టీడీపీ నేతలు తాళ్లూరు లిఫ్టు ద్వారా సాగునీరు అందటం లేదని రైతులపై కపట ప్రేమ చూపిస్తున్నారన్నారు. ఇప్పటివరకూ రైతులను దగా చేసింది టీడీపీ ప్రభుత్వమేనని తెలిపారు. సీఎస్ఆర్ నిధులతో తాళ్లూరు ఎత్తిపోతల పథకానికి మరమ్మతులు చేసి రైతులకు సాగునీరు అందిస్తే అదంతా తమ పోరాటం వల్ల జరిగిందని చెప్పుకోవడానికి టీడీపీ నేతలు పథకం వేశారన్నారు. దీనిలో భాగంగానే జగ్గంపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన చేయడానికి నిర్ణయించారని చెప్పారు. రైతుల సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరించేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే అని స్పష్టం చేశారు. సమావేశంలో జగ్గంపేట ఎంపీపీ అత్తులూరి నాగబాబు, గండేపల్లి ఎంపీపీ చలగళ్ల దొరబాబు, జగ్గంపేట మండల సచివాలయాల కన్వీనర్ బండారు రాజా, రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ డైరెక్టర్ అప్పారావు కాపు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ఒబిణ్ని వీరబాబు, వైఎస్సార్ సీపీ గండేపల్లి మండలాధ్యక్షులు కందుల చిట్టిబాబు, మద్దిపట్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నేతలు





చివరి మజిలీకి అవస్థలు


రామవరంలో పొలాల మధ్య నుంచి మృతదేహాన్ని శ్మశానవాటికకు తరలిస్తున్న కుటుంబ సభ్యులు

జగ్గంపేట: మండలంలోని రామవరం కొత్త ఎస్సీ కాలనీవాసులకు చివరి మజిలీకి కష్టాలు తప్పడం లేదు. రామవరం కొత్త ఎస్సీ కాలనీ నుంచి క్రిస్టియన్ శ్మశాన వాటికకు వెళ్లేందుకు ప్రజలు అవస్థలు పడుతున్నారు. కొత్త ఎస్సీ కాలనీకి చెందిన చింతపల్లి వెంకటలక్ష్మి ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె మృతదేహాన్ని శ్మశాన వాటికకు తీసుకు వెళ్లడానికి బంధువులు కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శ్మశాన వాటికకు వెళ్లేందుకు సరైన మార్గం లేకపోవడంతో నాట్లు వేసిన వరి పొలాల మధ్య నుంచి మృతదేహాన్ని తీసుకువెళ్లారు.

40 ఏళ్లుగా...

సుమారు 40 సంవత్సరాల క్రితం కాలనీ ఏర్పడిందని, అప్పటి నుంచి ఇప్పటివరకూ శ్మశాన వాటికకు మార్గం సమస్య పరిష్కారం కాలేదని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు జుత్తుక నాగేశ్వరరావు తెలిపారు. తమ కాలనీకి ఒకపక్క జాతీయ రహదారి, మరో పక్క గోనేడ వెళ్లే రహదారి ఉన్నాయని, పొలాల మధ్యలో నుంచి రోడ్డు ఏర్పాటు చేస్తే శ్మశానానికి త్వరగా వెళ్లవచ్చన్నారు. ఈ సమస్యను పరిష్కరించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. దీనిపై పంచాయతీ ఈఓ బి.రాగాలను వివరణ కోరగా శ్మశానానికి వెళ్లడానికి వేరే రహదారి ఉందన్నారు. కొత్త ఎస్సీ కాలనీకి ఇది దూరం కావడంతో పొలాల మధ్య నుంచి రహదారి వేయాలని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారని చెప్పారు. రైతుల నుంచి భూసేకరణ పంచాయతీ నుంచి రోడ్డు వేస్తామని తెలిపారు.







జగన్ పాలన దేశానికే ఆదర్శం

- మాజీ మంత్రి తోట నరసింహం
- రామయ్యపాలెంలో ఆత్మీయ సమావేశం

గండేపల్లి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శమని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నాయకుడు తోట నరసింహం అన్నారు. మండలంలోని రామయ్యపాలెంలో ఆదివారం ఆయన అనుచరులు ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో తోట నరసింహం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నారన్నారు. నాడు–నేడు పథకంలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు పూర్తిగా మారుతున్నాయన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు లభిస్తున్నాయని తెలిపారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. అనంతరం రౌతు సత్తిబాబు ఆధ్వర్యంలో గ్రామంలో పేదలకు దుస్తులు, క్రీడాకారులకు వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉభయగోదావరి జిల్లాల ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ గుల్లా యేడుకొండలు, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ రామకుర్తి మూర్తి, జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ ఎస్‌ఏ గఫూర్, అన్నవరం దేవస్థానం ట్రస్ట్‌బోర్డ్ మాజీ సభ్యుడు కరుటూరి శ్రీనివాస్, పార్టీ నాయకులు తోట రాంజీ, కోర్పు దుర్గాప్రసాద్, తొండాపు రామిరెడ్డి, పరిమి వెంకటేశ్వరరావు, తోట అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.


ఆత్మీయ సమావేశంలో ప్రసంగిస్తున్న మాజీ మంత్రి తోట నరసింహం

ఘనంగా విద్యార్థి వికాస కేంద్రాల సమ్మేళనం


తునిలో భగవద్గీత శ్లోకాలపై ప్రదర్శన ఇస్తున్న చిన్నారులు

తుని: స్థానిక శ్రీప్రకాష్ విద్యా సంస్థల్లో తుని, పాయకరావుపేట గ్రామీణ విద్యార్థి వికాస కేంద్రాల సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి అఖిల భారత గ్రామీణ వికాస సహ సమయోజిక్ గురురాజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పిల్లలు క్రమశిక్షణ, దేశభక్తిని అలవర్చుకోవాలన్నారు. గ్రామాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. గ్రామీణ వికాస్ ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలో కమిటీలను ఏర్పాటు చేసి గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించాలని సూచించారు. పలు గ్రామాల నుంచి వచ్చిన విద్యార్థులు భగవద్గీత శ్లోకాలకు వివిధ విభాగాల్లో ప్రదర్శనలు ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామీణ ప్రాంత వికాస్ ప్రముఖ్ తిరుపతయ్య, గోదావరి విభాగ్ ప్రముఖ్ చదరం నరశింగరావు, ధన్యం రాజు సత్యసాయి, కుందెం సత్యనారాయణ, ప్రసాద్, బాలాదిత్య, స్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు పోలీసులతో మమేకం కావాలి

కిర్లంపూడి: ప్రజలు పోలీసులలో మమేకం కావాలని కిర్లంపూడి ఎస్సై బి.ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. మండలంలోని రామకృష్ణపురంలో ఆదివారం వారధి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు ప్రతి చిన్న విషయానికి రాగద్వేషాలకు పోకుండా స్నేహభావంతో కలిసి మెలిసి ఉండాలన్నారు. చిన్న చిన్న సమస్యలను గ్రామ పెద్దల సమక్షంలోనే పరిష్కరించుకోవాలన్నారు. పోలీస్ స్టేషన్లు, కేసులు, కోర్టులు చుట్టు తిరిగి ఆర్థికంగా నష్టపోవద్దని సూచించారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు ఎవరైన కనిపిస్తే తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.


రామకృష్ణాపురం వారధి కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్సై ఉమామహేశ్వరరావు





దివ్యాంగులకు పండ్లు, స్వీట్లు పంపిణీ

తొండంగి: మండలంలోని బెండపూడి శివారు శాంతివర్ధన ఆశ్రమ పాఠశాలలో దివ్యాంగ విద్యార్థులకు ఆదివారం లయన్స్‌క్లబ్ ప్రతినిధులు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. అలాగే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. అనంతరం దివ్యాంగులకు ఆటలు, పాటల పోటీలు నిర్వహించారు.

ఘనంగా ఆజాదీ కా అమృత్ మహోత్సవ్



చినశంకర్లపూడిలో కొబ్బరి మొక్కను నాటుతున్న నాయకులు



బిళ్లనందూరులో ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీపీ శ్రీనివాసు తదితరులు



లోవకొత్తూరులో నినాదాలు చేస్తున్న ప్రజా ప్రతినిధులు

రౌతులపూడి: మండలంలోని పి.చామవరం, ఎం.చామవరం, డీజే పురం, ములగపూడి, శృంగవరం, రాఘవపట్నం, ఎం.కొత్తూరు గ్రామాల్లో ఆదివారం ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ప్రజా ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది ర్యాలీలు చేసి ప్రజలకు హర్‌ఘర్ తిరంగాపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రతిజ్ఞ చేసి మొక్కలు నాటారు.

ప్రత్తిపాడు: మండలంలోని చినశంకర్లపూడిలో ఆదివారం నాభూమి–నా దేశం, నేలతల్లికి నమస్కారం, వీరులకు వందనం కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ఏపూరి రామారావు జాతీయ పతాకాన్ని, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సందేశాలను పంచాయతీ కార్యదర్శి అడబాల సత్యనారాయణ మూర్తి వినిపించారు. అనంతరం గ్రామంలో కొబ్బరి మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పిల్లా కొండలరావు (చిన్న), వైఎస్సార్ సీపీ నాయకులు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.



గోవిందపురంలో ప్రతిజ్ఞ చేస్తున్న నేతలు

ముగిసిన నా భూమి –నా దేశం

కోటనందూరు: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మూడు రోజుల పాటు నిర్వహించిన నా భూమి–నా దేశం కార్యక్రమాలు ఆదివారంతో ముగిశాయి. చివరి రోజు బిళ్లనందూరు, బొద్దవరం, భీమవరపుకోట, కాకరాపల్లి గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఎంపీపీ లగుడు శ్రీనివాసు పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. మట్టి కలశాలతో ప్రతిజ్ఞ చేశారు. బిళ్లనందూరులో అమరవీరుల కుటుంబ సభ్యులను సత్కరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి రాష్ట్ర డైరెక్టర్ లంక ప్రసాద్, సర్పంచులు జిగటాల వీరబాబు, వేగి లక్ష్మి, బొత్సమంగ, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ, ఏపీఓ రామచంద్రరావు పాల్గొన్నారు.

తుని రూరల్: మండలంలోని లోవ కొత్తూరు, కొలిమేరు, వల్లూరు, అగ్రహారం, టి.తిమ్మాపురం గ్రామాల్లో ఆదివారం నామట్టి–నాదేశం కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు నామట్టి–నాదేశం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. గ్రామాల్లో ర్యాలీలు చేసి ప్రజలకు ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌పై అవగాహన కల్పించారు. సర్పంచులు లంక వెంకటలక్ష్మి, కుర్ర విజయలక్ష్మి, నాయకులు లంక కృపానందం, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

జగ్గంపేట మండలంలో..

జగ్గంపేట: మండలంలోని గోవిందపురంలో ఆదివారం నా మట్టి–నా దేశం కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఇళ్ల అప్పారావు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. అనంతరం వృద్ధులను సత్కరించారు. అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వసంతకుమార్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు మరింత విస్తృతం



ప్రత్తిపాడులో వసతిగృహానికి ఆర్థిక సహాయం అందిస్తున్న లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గోపాలరావు

ఏలేశ్వరం: పేదలకు లయన్స్ క్లబ్ ద్వారా అందించే సేవలను మరింత విస్తృతం చేయనున్నట్టు లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ గోపాలరావు తెలిపారు. అధికారిక పర్యటనలో భాగంగా పట్టణంలోని లయన్స్ క్లబ్ సేవలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా లయన్స్ క్లబ్ సేవలను విస్తృతం చేశామన్నారు. ఏలేశ్వరం క్లబ్ సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. అనంతరం ఆయనను క్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్ జిల్లా కాబినెట్ కార్యదర్శి విప్పల ప్రసాద్, క్లబ్ కార్యదర్శి కప్పల నాగభూషణం, డిస్ట్రిక్ చైర్మన్ ఏడీవీ ప్రసాద్, జ్యోతుల శ్రీనివాస్, తాళ్లూరి గొల్లాజీరావు, చందువోలు రాజా తదితరులు పాల్గొన్నారు.

ఆలంబన బాలికల హాస్టల్‌కు ఆర్థిక సాయం

ప్రత్తిపాడు: లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎ.గోపాలరావు ఆదివారం డాన్ టు డస్క్ (సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు) పర్యటనలో భాగంగా ప్రత్తిపాడు లయన్స్‌క్లబ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి వ్యక్తిత్వం, సేవాభావం కల వ్యక్తులను క్లబ్‌లో చేర్చుకోవాలని సూచించారు. స్థానిక ఆలంబన బాలికల వసతి గృహంలోని బాలికలకు రూ.4 వేలు విలువ గల నిత్యావసర వస్తువులు, రూ.5 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అనంతరం స్థానిక మినర్వా విద్యా సంస్థల ఆవరణలో లయన్స్ గవర్నర్‌తో పాటు డిస్ట్రిక్ట్ వైస్ గవర్నర్లు ఎన్‌వీబీఎస్ ప్రసాద్, సూర్య ప్రకాష్, డిస్ట్రిక్ట్ కేబినెట్ సభ్యులు మొక్కలను నాటారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు బి. మోహన్, మినర్వా విద్యాసంస్థల అధినేత డీవీఎస్ రమేష్‌రాజు, ఏడిద రెడ్డినాయుడు, డీవీఎస్ గోపిరాజు, గుడాల వెంకటరత్నం, ఇందన ఏసుబాబు, తాతా సాంబు తదితరులు పాల్గొన్నారు.

సత్రం భూములను కాపాడాలంటూ ర్యాలీ



సుందరమ్మ సత్రం భూముల్లో ర్యాలీ చేస్తున్న రైతు కూలీలు

గోకవరం: రంపయర్రంపాలెంలోని సుందరమ్మ సత్రం భూములను భూస్వాములకు కట్టబెట్టే ప్రయత్నాలను అధికారులు మానుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరంజనేయులు సూచించారు. ఈ మేరకు రంపయర్రంపాలెంలోని సుందరమ్మ సత్రం భూముల్లో ఆదివారం దళితులు, వెనకబడిన వర్గాలతో కలిసి నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వీరంజనేయులు మాట్లాడుతూ సుందరమ్మ సత్రం భూములకు వేలం నిర్వహిస్తామని చెప్పి రెండు నెలలు గడుస్తున్నా అధికారులు నేటికీ వేలం నిర్వహించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మిగులు భూములకు వేలం నిర్వహించకపోతే అమరావతిలో దేవదాయ, ధర్మాదాయ శాఖ రాష్ట్ర కార్యాలయం ముందు దీక్ష చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సురేష్, శ్రీకాంత్, గోలి మునలియ్య, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

బాబోయ్ ఎండలు

తొండంగి: వారం రోజులుగా ఎండలు మండిపోతున్నాయి. మెట్ట ప్రాంతమైన తుని నియోజవర్గంలో ఆదివారం వేసవిని తలపించేలా ఎండ కాసింది. ఉదయం నుంచే భానుడు తన ప్రతాపం చూపడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. ఉక్కబోత ఎక్కువగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎండలకు పలు గ్రామాల్లో నాడు మడులు ఎండిపోతున్నారు. వర్షాల కోసం ఆకాశం వైపు అన్నదాతలు ఆశగా ఎదురు చూస్తున్నారు.

రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం దుర్గాడలో వేంచేసిన రామలింగేశ్వరస్వామికి ఆదివారం అష్టోత్తర నారికేళ జలాభిషేకం చేసినట్టు ఆలయ అర్చకుడు వీరబాబు దత్తులు తెలిపారు. ఆరుద్ర నక్షత్రం సందర్భంగా స్వామివారికి మహాన్యాస పారాయణం చేసి పంచామృతాభిషేకం, శత నారికేళ అర్చన నిర్వహించామన్నారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



ప్రత్యేక అలంకరణలో రామలింగేశ్వరస్వామి

నేడు ఉత్తరకంచిలో ఎమ్మెల్యే పర్యటన

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఉత్తరకంచిలో సోమవారం ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ పర్యటిస్తారని వైఎస్సార్ సీపీ జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ రామిశెట్టి చినబాబు ఆదివారం తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు గ్రామంలోని వేంకటేశ్వర ఫంక్షన్ హాల్‌లో ప్రత్తిపాడు, ఏలేశ్వరం మండలాల లబ్ధిదారులకు వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం నమూనా చెక్కులను అందజేస్తారన్నారు. ప్రత్తిపాడు మండలంలో 1,899 డ్వాక్రా సంఘాలకు రూ.2.36 కోట్లు, ఏలేశ్వరం మండలం 1,150 డ్వాక్రా సంఘాల రూ.1.44 కోట్లు నాలుగో విడత సున్నా వడ్డీ కింద లబ్ధి చేకూరుతుందన్నారు.

మెట్టలో అడుగంటిన చెరువులు


లోవకొత్తూరు చెరువులో అడుగంటిన జలాలు


మెట్టలో నాట్లు వేయకపోవడంతో నిరుపయోగంగా ఉన్న సాగుభూములు

- ఖరీఫ్ వరిసాగుకు నీటి కొరత
- ఆకాశం వైపు ఆశగా చూస్తున్న అన్నదాతలు

తుని రూరల్: మెట్ట ప్రాంతమైన తుని నియోజకవర్గంలో ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో సాగునీటి చెరువులు వెలవెలబోతున్నాయి. చెరువుల్లో నీరు అడుగంటడంతో ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. గత నెలలో వరి విత్తనాలు వేయగా ఆకుమడులు ముదురుతున్నాయి. శాశ్వత సాగునీటి వనరులు లేకపోవడంతో రైతులు వర్షాధారంగానే ఖరీఫ్ సాగు చేస్తున్నారు. ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్ మొదలై 70 రోజులవుతున్నా నాట్లు వేయని పరిస్థితి నెలకొంది. నీటి లభ్యత కొరవడడంతో నాట్లు వేయలేదని లోవ కొత్తూరు, రాజుపేట, మర్లపాడు, వి.కొత్తూరు, చేపూరు, దొండవాక, కేఓ మల్లవరం, రాపాక, సుభద్రయ్యమ్మ పేట, డి.పోలవరం, కొలిమేరు, ఎస్.సూరవరం, ఎస్ఎస్‌వీ నగరం, కుమ్మరిలోవ, తదితర గ్రామాలకు చెందిన రైతులు తెలిపారు. పుష్కర కాలువ నీరు విడదలైనప్పటికీ తుని మండలంలో భూములు శివారు కావడంతో నీరు చేరడం లేదు. మండలంలో 75 చెరువులు ఉండగా 60 చెరువుల్లో జలకళ కానరావడం లేదు. బోరుబావులు, అడపదడపా కురుస్తున్న వర్షాలకు రైతులు నారుమళ్లు వేశారని, నాట్లు వేసేందుకు నీటి కొరత ఉందని వ్యవసాయ సహాయ సంచాలకులు సుంకర బుల్లిబాబు తెలిపారు. తుని మండలంలో ఆరు వేల ఎకరాల్లో ఖరీఫ్ నాట్లు వేయాల్సి ఉందన్నారు. ప్రస్తుత వాతావరణం ఆరు తడి పంటలకు అనుకూలంగా ఉందని తెలిపారు. రైతుల వెదజల్లు, చిరుధాన్యాల సాగుపై దృష్టి సారించాలని సూచించారు.

అనాథ పిల్లలకు టవల్స్, పెన్నుల పంపిణీ


ఏలేశ్వరంలో అనాథపిల్లలకు టవల్స్ పంపిణీ చేస్తున్న దాతలు

ఏలేశ్వరం: పట్టణంలోని స్వామి దయానంద సేవాశ్రమంలోని అనాథ పిల్లలకు ఆదివారం దాతలు టవల్స్, పెన్నులు పంపిణీ చేశారు. పట్టణానికి చెందిన వ్యాపారి వెత్సా స్వామి కుమారుడు యశ్విన్ జన్మదినాన్ని పురస్కరించుకుని అనాథలకు టవల్స్, పెన్నులు, పెన్సిల్స్, స్నాక్స్ పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. దాతలను సేవాశ్రమం నిర్వాహకులు అభినందించారు.

120 మందికి వైద్య పరీక్షలు


లింగంపర్తిలో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

ఏలేశ్వరం: మండలంలోని లింగంపర్తిలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామానికి చెందిన మద్దుల నరసింహమూర్తి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు మద్దుల శ్రీను ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కాకినాడ ట్రస్టు ఆసుపత్రికి చెందిన యూరాలజిస్టు ఆదిమూలం గణేష్, పట్టణానికి చెందిన ఆర్థోపెడిక్ ఉమామహేష్ 120 మందికి వైద్య పరీక్షలు చేశారు. వారిలో 100 మందికి సుమారు రూ.25 వేల విలువ చేసే మందులను ఉచితంగా పంపిణీ చేశారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన


కొత్తూరులో రోగులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ సౌమ్యశ్రీ

శంఖవరం: డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పి.మల్లాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి సౌమ్యశ్రీ సూచించారు. మండలంలోని కొత్తూరులో ఆదివారం సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏడిస్ దోమ కుట్టడం వలన డెంగీ వస్తుందని, ఈ దోమ పగటి పూట మాత్రమే కుడుతుందన్నారు. ఒళ్లు నొప్పులు, కాళ్లు లాగడం, వాంతులు, చలి జ్వరం, పళ్ల చిగుళ్ల నుంచి రక్తం కారడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డుపైకి తుప్పలు.. రాకపోకలకు తిప్పలు


ఏలేశ్వరంలో రహదారికి ఇరువైపులా పెరిగిపోయిన తుప్పలు

ఏలేశ్వరం: పట్టణంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా తుప్పలు పెరిగిపోవడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. స్థానిక షిర్డీ నగర్‌లోని గాంధీజీ విగ్రహం సమీపంలో సీసీ రోడ్‌కు ఇరువైపులా భారీగా తుప్పలు పెరిగిపోయాయి. దీంతో ఈ రహదారిపై ఎదురెదురుగా వస్తున్న వాహనాలు కనిపించడం లేదు. ద్విచక్ర వాహనాలు సైతం తప్పుకొనేందుకు వీలులేక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే రహదారి తుప్పలతో మూసుకుపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో పాటు పాముల బెడద ఎక్కువగా ఉండడంతో మహిళలు భయాందోళన చెందుతున్నారు. దీనిపై మున్సిపల్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా తుప్పలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

సినీ ఫక్కీలో సెల్‌ఫోన్ చోరీ

తుని రూరల్: మండలంలోని తేటగుంట శివారు ఎర్రకోనేరు వద్ద ఆదివారం సినీఫక్కీలో సెల్‌ఫోన్ చోరీ చేశారు. వివరాల్లోకి వెళితే....రౌతులపూడి మండలం బీబీ పట్నం గ్రామానికి చెందిన నల్లిమిల్లి యర్రాపాత్రుడు మోటార్ సైకిల్‌పై తుని వస్తున్నాడు. ఎర్రకోనేరు వద్దకు చేరుకున్న అతని ముందు మరో బైక్‌పై ఇద్దరు ప్రయాణిస్తూ అదుపుతప్పి కిందపడినట్టు నటించారు. దీంతో యర్రాపాత్రుడు వారికి సాయం అందించేందుకు వెళ్లగా అతని జేబులో ఉన్న సెల్‌ఫోన్‌ను వారు కాజేసి బైక్‌పై తునివైపు వెళ్లిపోయారు. దీనిపై రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేస్తానని బాధితుడు తెలిపారు. గత నెలలో డబ్బు కోసం హోటల్‌లో మహిళలను ఇద్దరు హంతకులు ఈ ప్రాంతంలోనే హత్య చేశారు. వరుస సంఘటనలతో ఆ ప్రాంత వాసులు ఆందోళనకు గురవుతున్నారు.

నేడు ఒమ్మంగిలో గడపగడపకూ మన ప్రభుత్వం

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఒమ్మంగిలో సోమవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ రామిశెట్టి చినబాబు ఆదివారం తెలిపారు. ఎమ్మెల్యే పర్వత ప్రసాద్ గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుంటారన్నారు.